క్లుప్తంగా

అభయాంజనేయునికి అన్న కూటాభిషేకం



అభయాంజనేయునికి అన్నకూటాభిషేకం

విజయనగరం టౌన్: స్థానిక సిటీ బస్టాండ్ వద్దనున్న అభయాంజనేయ స్వామి ఆలయంలో స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు వికె. గాయత్రీ శర్మ ఆధ్వర్యంలో మంగళవారం అన్న కూటాభిషేకం నిర్వహించారు. స్వామివారికి తీపి పదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ స్థలం ఆక్రమణ



పినవేమలి గ్రామంలో ఆర్అండ్‌బీ స్థలంలో ఏర్పాటు చేసిన దుకాణం

విజయనగరం రూరల్: మండలంలోని పినవేమలి గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఆర్అండ్‌బీ రహదారి స్థలంలో ప్రైవేటు వ్యక్తి ఒకరు ఆక్రమణ చేసి దుకాణం ఏర్పాటు చేశారని ఆ గ్రామ సర్పంచ్ సాయి ఎంపీడీఓ, తహసీల్దార్లకు మంగళవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో పంచాయతీ బోర్డు వద్దని వారించినా వినకుండా స్థలం కబ్జా చేసి షాపు ఏర్పాటు చేశారని తెలిపారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి దుకాణాన్ని తక్షణమే తొలగించాలని సర్పంచ్ కోరారు.

విద్యార్థులకు పలు పోటీలు

డెంకాడ: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని డెంకాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. చైర్‌గేమ్ పోటీల్లో జ్ఞానేశ్వరరావు, జి.జగత్, గౌరీశంకర్ వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గ్రంథాలయ వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని గ్రంథాలయాధికారి వై.మహేష్ తెలిపారు.

అరుంధతీస్ రిజర్వేషన్లను ప్రామాణికంగా తీసుకోవాలి

- కలెక్టర్‌కి అంబేడ్కర్ రైట్స్ ఫోరం ప్రతినిధి వినతి



కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేస్తున్న భానుమూర్తి

విజయనగరం అర్బన్: రాష్ట్రంలో తమిళనాడు ప్రభుత్వం 2009లో తెచ్చిన యాక్ట్ ఆఫ్ 4/2009 అరుంధతీస్ రిజర్వేషన్లను ప్రామాణికంగా తీసుకోవాలని అంబేడ్కర్ రైట్స్ ఫోరం ప్రతినిధి బొంగ భానుమూర్తి డిమాండ్ చేసారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్సీ ఉప వర్గీకరణకు సంబంధించి జీఓ 86 ద్వారా ఏర్పాటు చేసిన క్రమంలో దానికి పర్యావసానంపై 17 పేజీలతో కూడిన సమగ్ర వివరాలను కలెక్టర్ డాక్టర్ అంబేడ్కర్‌ను మంగళవారం కలిసి ఆయన ద్వారా ప్రభుత్వానికి తెలియజేసారు. ఆర్టికల్ 341 సవరించే అధికారాలు రాష్ట్ర ప్రభుత్వాలకు ఇవ్వడం ఎస్సీల ఐక్యతకు ప్రమాదంగా మారుతుందని పేర్కొన్నారు. 1931 సెన్సస్ ప్రకారం రిజర్వేషన్ కల్పించే క్రమంలో 2005లో చేపట్టే కుల జనగణన ఆధారంగా.. అదే విధంగా తమిళనాడు ప్రభుత్వం అమలు చేసిన అరుంధతీస్ రిజర్వేషన్లను ప్రామాణికంగా తీసుకోవాలని కోరారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

భోగాపురం: మండలంలోని గుడివాడ గ్రామానికి చెందిన యవతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఎన్‌వీ ప్రభాకర్ తెలిపారు. ఈ నెల 17న ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి ఇంతవరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికినా ప్రయోజనం లేకపోవండతో యువతి తల్లి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

విద్యాప్రమాణాలు మెరుగుపరచాలి

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపరచాలని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని ఖండ్యాం స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి మంగళవారం హాజరైన ఆయన.. అన్ని పాఠశాలల్లో అన్ని సదుపాయాలు కల్పించడం జరిగిందని, వాటిని సద్వినియోగం చేసుకుని ఉపాధ్యాయులు మంచిగా విద్యను బోధించాలని తెలిపారు. విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ కార్యదర్శి మురపాక వెంకటరమణ, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం బి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లీ సాగదీత..!

- కొనసాగుతున్న అంబటిసత్రం జంక్షన్ కొత్తపేట రోడ్డు విస్తరణ పనులు
- విస్తరణ పనులు పూర్తిపై దృష్టి సారించని ప్రస్తుత ఎమ్మెల్యే
- మాజీ ఎమ్మెల్యే కోలగట్ల చొరవతో రూ.3.15 కోట్ల నిధులు మంజూరు
- 60 అడుగుల వెడల్పుతో 500మీటర్ల పొడవున రోడ్డు నిర్మాణం
- విస్తరణ పనులు పూర్తయితే తీరనున్న ట్రాఫిక్ సమస్య



విస్తరణ పనులు చేపట్టాల్సిన అంబటిసత్రం జంక్షన్ నుంచి కొత్తపేట నీళ్లట్యాంకుకు వెళ్లే ప్రధాన రోడ్డు



విజయనగరం: 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నగరంలోని అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను పూర్తి చేస్తాం.. ప్రధానంగా రహదారి విస్తరణ పనులను పూర్తి చేసేందుకు ప్రాధాన్యతనిస్తాం...' ఇవీ 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రస్తుత ఎమ్మెల్యే పూసపాటి అతిధిగజపతిరాజు ప్రజలకు ఇచ్చిన హామీ. అయితే నగరంలోని అంబటిసత్రం జంక్షన్ నుంచి కొత్తపేట నీళ్ల ట్యాంక్ వరకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించి 60 శాతం పనులు పూర్తి చేసిన విస్తరణ పనుల్లో పురోగతి కనిపించటం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా పనులు నత్తనడకన సాగుతుండటంతో అటుగా రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు.

విజయనగరం జిల్లా కేంద్రంలో నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే అంబటిసత్రం జంక్షన్ నుంచి కొత్తపేట రోడ్డు విస్తరణకు సంబంధించిన మిగులు పనులు ఎప్పటికి పూర్తవుతాయోనన్న సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు నగర అభివృద్ధే ధ్యేయంగా విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన రోడ్ల విస్తరణ పనులు పూర్తి చేయటంపై గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా నగరంలోని వివిధ మార్గాల్లో రోడ్ల విస్తరణ పనులు పూర్తి చేసి ప్రగతి బాటలు వేసింది. నగరంలోని నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే 1.2 కిలోమీటర్ల పొడవు గల బాలాజీ జంక్షన్ నుంచి మయూరి జంక్షన్‌కు వెళ్లే ట్యాంక్‌బండ్ రోడ్‌ను 100 నుంచి 120 అడుగుల వెడల్పుతో 6 లైన్లుగా విస్తరించి వినియోగంలోకి తీసుకువచ్చిన విషయం విదితమే. ఇదే క్రమంలో నగరం నడిబొడ్డులో గల అంబటిసత్రం జంక్షన్ నుంచి కొత్తపేట నీళ్ల ట్యాంక్‌కు వెళ్లే ప్రధాన రహదారి విస్తరణ పనులు ప్రారంభించినప్పటికీ ఎన్నికల కోడ్ రాకతో నిలిచిపోయాయి.

మాజీ ఎమ్మెల్యే కోలగట్ల చొరవతో...

కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరంలో గతంలో ఎన్నడూ చూడని విధంగా గడిచిన 5 ఏళ్లలో అభివృద్ధి పనులు శరవేగంగా జరిగాయి. మాజీ ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి చొరవతో నగర సుందరీకరణ, రోడ్ల విస్తరణతో పాటు క్షేత్ర స్థాయి పర్యటనల్లో గుర్తించిన ప్రజా సమస్యలను పరిష్కరించటంలో భాగంగా అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేశారు. ఇందులో భాగంగా అంబటిసత్రం, కొత్తపేట నీళ్ల ట్యాంక్ రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేసి పనులు ప్రారంభించారు. ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో పనులు చేపట్టాల్సి ఉండగా... గతంలో వచ్చిన నిధులు వినియోగించకపోవటంతో వెనక్కి మళ్లిపోయాయి. మాజీ ఎమ్మెల్యే కోలగట్ల ప్రభుత్వ పెద్దలకు సమస్యను వివరించి వెనక్కి మళ్లిన నిధులను మంజూరు చేయించారు. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు పనులు ప్రారంభించారు.

సమన్వయ లోపంతో జాప్యం

అంబటిసత్రం – కొత్తపేట నీళ్ల ట్యాంక్ జంక్షన్ రహదారి విస్తరణ పనుల్లో కార్పొరేషన్, విద్యుత్ శాఖ అధికారుల మధ్య సమన్వయ లోపం స్పష్టమవుతోంది. వాస్తవానికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించినప్పటికీ భవనాల తొలగింపు ప్రక్రియ మధ్యలోనే చేతులెత్తేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించగా... ఆ మార్గంలో ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపు పనులు సంబంధిత శాఖ అధికారులు చేపట్టకపోవటంతో పనుల్లో జాప్యం నెలకొంది. తాజాగా ఈ పనులు చేపడుతున్నప్పటికీ ఇంకెన్ని రోజులు సాగదీస్తారంటూ నగర ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

పక్షం రోజుల్లో పూర్తి చేస్తాం

నగరంలోని అంబటిసత్రం జంక్షన్ నుంచి కొత్తపేట రోడ్డు విస్తరణ పనులు పక్షం రోజుల్లో పూర్తి చేస్తాం. విద్యుత్ శాఖ చేపట్టాల్సిన పనులు తుది దశకు వచ్చాయి. మా శాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన మిగులు పనులను కొద్ది రోజుల్లో పూర్తి చేస్తాం. కార్పొరేషన్ ఆధ్వర్యంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తే విస్తరణ పనులు పూర్తియినట్లే. – టి.శ్రీనివాసరావు, డీఈఈ, ఆర్అండ్‌బీ, విజయనగరం

60 మీటర్ల వెడల్పుతో... 500 మీటర్ల పొడవున..

అంబటిసత్రం జంక్షన్ నుంచి కొత్తపేట నీళ్ల ట్యాంక్ వరకు 60 మీటర్ల వెడల్పుతో 500 మీటర్ల పొడవున రోడ్డు విస్తరణ పనులు 30 శాతం పూర్తయ్యాయి. మొత్తంగా రూ.4 కోట్లతో ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో పనులు చేపట్టాల్సి ఉండగా... 2014 – 19 సంవత్సరాల మధ్య రూ.85 లక్షల మేర ఖర్చు చేసి పనులు చేపట్టలేమంటూ చేతులెత్తేశారు. అనంతరం 2019 – 24 సంవత్సరాల మధ్య అధికారంలో ఉన్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మిగిలిన రూ.3.15 కోట్లును మంజూరు చేసింది. దీంతో రోడ్డుకు ఇరువైపులా కాలువల నిర్మాణాలు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు నిర్ణయించారు. రాళ్లు తేలి అస్తవ్యస్తంగా ఉన్న రహదారిలో కొద్ది నెలల క్రితం బీటీ వేశారు. మిగిలిన పనులు ప్రారంభించి పూర్తి చేస్తే విజయనగరం నుంచి పాలకొండ వెళ్లే ఈ రద్దీ మార్గంలో ప్రయాణం సుగమం కానుంది.

ఆధునిక పద్ధతుల్లో సాగు మేలు

- ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ



డెంకాడలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఉపకులపతి శారదా జయలక్ష్మి, పరిశోధనా డైరెక్టర్ సత్యన్నారాయణ, ఇతర అధికారులు, రైతులు

డెంకాడ: రైతులు సాంప్రదాయ పద్ధతులను వీడి, ఆధునిక పద్ధతుల్లో పంటల సాగు చేయడం ద్వారా బహుళ ప్రయోజనాలు పొందవచ్చని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆర్.శారదా జయలక్ష్మి అన్నారు. డెంకాడలోని ఆదర్శ రైతు కె.పాణిరాజు పొలంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏరువాక క్షేత్ర దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆధునిక పద్ధతుల్లో పంటల సాగు చేయడం ద్వారా రైతులకు ఖర్చు తగ్గడంతో పాటు పంట దిగుబడి అధికంగా వస్తుందన్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ పీవీ సత్యనారాయణ మాట్లాడుతూ రైతులు నేల స్వభావాన్ని ఆధారంగా చేసుకుని పంటలు సాగుతో పాటు విత్తనాలు ఎంపిక వంటివి చేసుకోవడం ద్వారా బాగుంటుందన్నారు. కొత్త రకాల వంగడాలను ఎంపిక చేసుకోవాలన్నారు. రైతులు పంటల సాగుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏ సమయంలో ఎలాంటి పంటలు సాగు చేయాలి, ఎలాంటి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి వంటివి రైతులు అవగాహన ఉండటం ద్వారా పంట దిగుబడి బాగుండటంతో పాటు మంచి ఆదాయం వస్తుందన్నారు. ఎంటీయూ 7034, 7089 వరి పంటలను పరిశీలించారు. గాజులరేగ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త ఎంవీవీ శ్రీనివాస్ పాత్రో, జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు, ఏడీఏలు నాగభూషణం, సాంబయ్య, ముకుంద, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, ఏఓ పి.నిర్మల, పలువురు శాస్త్రవేత్తలు, అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి

- ఇంజనీరింగ్ అధికారులతో కమిషనర్ సమీక్ష



పట్టణాభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: పట్టణ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులు నిర్దేశిత కాలంలో, పూర్తి నాణ్యత ప్రమాణాలతో జరగాలని ఇంజనీరింగ్ అధికారులకు కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. తన చాంబర్‌లో ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందితో మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఇప్పటికే పూర్తయిన పనులు, చేపట్టబోయే పనుల ప్రగతికి గూర్చి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో రాజీ పడకూడదన్నారు. యం బుక్‌లు తప్పనిసరిగా సంబంధిత ఏఈల వద్దే ఉండాలని చెప్పారు. లేని పక్షంలో క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డంపింగ్ యార్డ్‌కు ప్రహరీ గోడ నిర్మాణానికి అంచనాలు రూపొందించాలన్నారు. ముఖ్యంగా కల్వర్టులకు గ్రేటింగ్‌లు ఉండాలన్నారు. పార్కులను పరిరక్షించుకోవాలని వాటికి అవసరమైన రక్షణ గోడలను నిర్మించాలని చెప్పారు. ఎక్కడా విద్యుత్ దీపాల సమస్య రాకూడదని అన్నారు. సుమారు 1000 విద్యుత్ దీపాలు మరమ్మతులకు గురికావడాన్ని గమనించమన్నారు. వాటిని సరి చేయించి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. బోర్‌వెల్స్ మెటీరియల్స్, క్లోరిన్, బ్లీచ్ వంటి సామగ్రిని స్టాక్ రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయించాలన్నారు. ప్రతి వాటర్ ట్యాంక్ వద్ద మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. వాటర్ ట్యాంకులు ప్రతి 15 రోజులకొకసారి శుభ్రపరచాలని సూచించారు. పచ్చదనం పెంపొందించేందుకు ఇప్పటి నుంచి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఎండిపోయిన చెట్లను తక్షణం తొలగించాలని ఆదేశించారు. విద్యుత్ స్తంభాలపై డివిజన్ నెంబరు, సచివాలయం నెంబర్లతో పాటు క్రమ సంఖ్యలను పెయింటింగ్ చేయించాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టబోయే పనుల వివరాలను ప్రస్తావించారు. ఫుట్‌పాత్‌లను అందంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ నెల 24వ తేదీలోపు అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద మరుగుదొడ్లు ఏర్పాటుకు సంబంధించి శంకుస్థాపన కార్యక్రమాలు పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వసంత విహార్ వద్ద పైపులైన్లు ఏర్పాటు చేసేందుకు టెండర్లు పిలిచి ఈ నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని చెప్పారు. రహదారులు వేసే సమయంలో క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది తప్పక ఆ ప్రదేశంలో ఉండి నాణ్యతను ధ్రువీకరించేందుకు ఎప్పటికప్పుడు క్యూబ్‌లను సేకరించాలన్నారు. సామాజిక మరుగుదొడ్ల నిర్వహణకై ఆసక్తి గల వారిని, అనుభవం ఉన్న వారిని టెండర్ల రూపంలో పిలవాలన్నారు. సమావేశంలో ఎంఈ టి.రాయిల్‌బాబు, డీఈలు ప్రసాద్, శ్రీనివాసరావు, మణికుమార్, ఉద్యాన శాఖ అధికారి ఉమా భరణి తదితరులు పాల్గొన్నారు.

పశుగణన సర్వే పరిశీలన



నెల్లిమర్ల మండలంలోని కొండవెలగాడ, మొయిద గ్రామాల్లో జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ వైవీ రమణ మంగళవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న పశుగణన సర్వేను పరిశీలించి, సిబ్బందిని పశువుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ 21వ జాతీయ పశుగణన సర్వే కార్యక్రమం కొనసాగుతోందన్నారు. గ్రామాల్లో సిబ్బంది పశువుల వివరాలను పక్కాగా సేకరించాలని, వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏడీ డాక్టర్ చక్రవర్తి, సిబ్బంది పాల్గొన్నారు. – నెల్లిమర్ల రూరల్

రైళ్లలో నేరాల నియంత్రణకు చర్యలు



రైళ్లలో జరిగే నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు విశాఖ రైల్వే సబ్ డివిజన్ డీఎస్పీ బి.మోహన్‌రావు పేర్కొన్నారు. స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో ఉన్న జీఆర్పీ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్‌లో ఉన్న రికార్డులు, కేసుల ఫైల్స్‌ను పరిశీలించారు. కొన్నింటిపై అధికారులకు పలు సూచనలు, సలహాలందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైళ్లలో దొంగతనాలు జరగకుండా ఉండేందుకు ప్రత్యేక నైట్ బీట్‌లు వేశామని, సిబ్బంది అప్రమత్తతో వ్యవహరించాలన్నారు. ప్లాట్‌ఫామ్స్ ఉండే ప్రయాణికుల నుంచి దొంగతనాలు చేసేందుకు వచ్చే నేరగాళ్లపై ఓ కన్నేసి ఉంచాలన్నారు. గంజాయి అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. జీఆర్పీ సీఐ రవికుమార్, ఎస్‌ఐ బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం క్రైమ్

అందరి సహకారంతోనే స్వచ్ఛ గ్రామాలు



డెంకాడ: ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ వాసుదేవరావు, ఇతర అధికారులు, సిబ్బంది



విజయనగరం రూరల్: పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న అధికారులు

డెంకాడ: బహిరంగ మలవిసర్జన లేని స్వచ్ఛ గ్రామాల నిర్మాణానికి అందరి సహకారం అవసరమని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు అన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మండల కాంపెక్స్ ప్రాంగణంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. మరుగుదొడ్లు ఉన్నవారందరూ వినియోగించాలన్నారు. లేనివారు మరుగుదొడ్లను నిర్మించుకోవాలని కోరారు. ఎంపీడీఓ భవాని, ఈఓ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు మరుగుదొడ్లను వినియోగించాలి

విజయనగరం రూరల్: ప్రతీ ఒక్కరు వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగించాలని, అలాగే వారు నివసించే గ్రామాల్లో బహిరంగ మలవిసర్జన జరగకుండా చూడాలని మండల ప్రత్యేకాధికారి అరుణకుమారి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను సన్మానం చేశారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ తిరుపతిరావు, ఏపీఓ రవిబాబు, పాటు పలువురు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల వినియోగంతో రోగాలు దూరం



పారిశుద్ధ్య కార్మికులను సన్మానం

నెల్లిమర్ల: విద్యార్థులు వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించడం ద్వారా రోగాలను దూరం చేసుకోవచ్చునని నెల్లిమర్ల సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మజ్జి సత్యనారాయణ సూచించారు. స్థానిక జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ప్రపంచ టాయిలెట్ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లను సత్కరించారు. ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు లెంక సంధ్య, అప్పారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం

భోగాపురం: ప్రపంచ టాయిలెట్ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి మండలంలో ఉన్న పారిశుద్ధ్య కార్మికులను శాలువాలతో ఘనంగా సన్మానించి నిత్యావసర సరుకులను అందజేశారు. అనంతరం మండలంలో వివిధ పంచాయతీల గ్రామాల్లో మంజూరైన టాయిలెట్ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. రావాడ సర్పంచ్ అప్పురభుక్త పైడినాయుడు, ఈఓపీఆర్‌డీ గాయత్రి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కామేశ్వరరావు, పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధురాళ్లను ఆదర్శంగా తీసుకోవాలి



రచయిత్రిని సత్కరిస్తున్న సంఘం పతినిధులు

విజయనగరం అర్బన్: స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న మహిళా యోధురాళ్లను నేటి మహిళలు ఆదర్శంగా తీసుకొని సమాజంలోని రుగ్మతలను దూరం చేయాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎంవీఎన్ వెంకటరావు పిలుపునిచ్చారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధురాలు ఝాన్సీ లక్ష్మీభాయి, మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఓ ప్రైవేటు నర్సింగ్ కళాశాలలో మహిళా సాధికారత అనే అంశంపై మంగళవారం జరిగిన సదస్సులో ఆయన ముఖ్య వక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఝాన్సీ లక్ష్మీభాయి, దుర్గాభాయ్, సరోజినీనాయుడు, సావిత్రిభాయ్ పూలే, మదర్ థెరిసా వంటి వారి జీవితాలు సమాజంపై ఎంతో ప్రభావం చూపించాలని ఆకాంక్షించారు. అనంతరం మహిళా రచయిత్రులు కొంకేపూడి అనురాధ, చెల్లపిల్ల శ్యామల, కొరుపోలు కళావతి, ఇనుగంటి జానకిలను సత్కరించారు. గ్రంథాలయ సంఘం వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్, గౌరవ అధ్యక్షుడు ఎస్ఎస్ఎస్ఎస్ రాజు, ఉపాధ్యక్షుడు కె.దయానంద్, ప్రధాన కార్యదర్శి రత్నాల బాలకృష్ణ, కళాశాల చైర్మన్ రమాదేవి, ప్రిన్సిపాల్ వీరాస్వామి, అధ్యాపకులు ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళులు



ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



ఇందిరాగాంధీకి నివాళులు అర్పిస్తున్న నాయకులు

విజయనగరం ఫోర్ట్: దేశ తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీకి కాంగ్రెస్ పార్టీ నేతలు ఘన నివాళులర్పించారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా డీసీసీ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్ మాట్లాడుతూ దేశ ప్రజల సౌలభ్యం కోసం 1969లో బ్యాంకులను జాతీయకరణ చేసి జాతికి అంకితం చేశారన్నారు. జాతీయ ఆహార భద్రతను తీసుకువచ్చిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. దేశ రక్షణ కోసం అణు భద్రతను తీసుకువచ్చిన ఆమె ధీర వనిత అని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు షరీఫ్, శ్రీనివాస్, బంగారునాయుడు, పి.శ్రీనివాస్, అచ్చిబాబు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్లలో..

నెల్లిమర్ల: దేశ మాజీ ప్రధానమంత్రి దివంగత ఇందిరాగాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గ సమన్వయకర్త గంటా సత్యనారాయణ, నాయకులు ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కనకల పద్మనాభం, రాయల సురేశ్, ఎస్.పృథ్వీ, మురళి, ప్రశాంత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉమాసోమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడలో ఉన్న అతి పురాతన శ్రీ ఉమాసోమేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫల రసాలు, పవిత్ర నదీ జలాలతో విశేష అభిషేకాలు జరిపించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో శివుడిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఉమా సోమేశ్వర స్వామి రుద్ర ఏకవార అభిషేకాలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు, శివ స్వాములు పాల్గొన్నారు.



స్వామి సన్నిధిలో రుద్ర ఏకవార అభిషేకాలు జరిపిస్తున్న అర్చకులు